## గోదావరిలో మునిగి బాలుడి మృతి

దండేపల్లి, ఏప్రిల్10: దండేపల్లి మండలంలోని గూడెం గోదావరిలో పడి ముత్తె శివకుమార్(7) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.కన్నెపల్లికి చెందిన శివకుమార్ స్థానికులతో కలిసి గోదావరికి వచ్చాడు. స్నానాలు చేస్తుండగా నీటి ఉధృతికి నీట మునిగిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో మృతిచెందాడు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

## విద్యుత్ షాక్‌తో ఆదివాసీ నాయకుడి మృతి


వెద్మ కిషన్(ఫైల్)

కాసిపేట, ఏప్రిల్ 10 : కాసిపేట మండలంలోని పల్లంగూడకు చెందిన ఆదివాసీ యువ నేత వెద్మ కిషన్(34) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన కథనం మేరకు... వెద్మ కిషన్ బుధవారం ఉదయం బయటకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చిన సమయంలో స్నానం చేసేందుకు ఇంట్లో నీళ్ల బావి మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించినట్లు తెలిపారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివాసీల సమస్యలపై ఆదివాసీ సంఘం యువ నేతగా వెద్మ కిషన్ క్రియాశీల పాత్రతో పాటు అనేక ఆదివాసీ ఉద్యమాల్లో పాల్గొని ఆదివాసీ సంఘాల్లో పలు బాధ్యతలు చేపట్టారు. వెద్మ కిషన్ మృతిపై ఆదివాసీ సంఘాల రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు నివాళులర్పించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు తరలివచ్చి నివాళులర్పించారు.

## గుండెపోటుతో కాంట్రాక్టు డ్రైవర్ మృతి


కోటేశ్(ఫైల్)

శ్రీరాంపూర్/సీసీసీనస్పూర్ ఏప్రిల్ 10 :శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ-3గని మేనేజర్ కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు కోటేశ్(58) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. నాగార్జునకాలనీలో నివాసముండే కోటేశ్ శ్రీరాంపూర్ ఓసీపీలో ఆపరేటర్‌గా పనిచేసి మెడికల్ అన్‌ఫిట్ అయి అల్లుడికి సింగరేణిలో పని పెట్టించాడు. ఖాళీగా ఉండకుండా ఎస్ఆర్‌పీ-3గని మేనేజర్ కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం మేనేజర్‌ను గనిపై దింపి నస్పూర్‌కు వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. కారును రోడ్డు పక్కన నిలిపి వేసి డ్రైవింగ్ సీటులోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లున్నారు. ఐఎన్టీయూసీ నాయకులు జెట్టి శంకర్‌రావు, గరిగే స్వామి, గని పిట్ కార్యదర్శి రిక్కుల గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి రాజు, తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని ప్రకటించారు.

## దాడి ఘటనలో కేసు నమోదు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 10: భూమిలోకి అక్రమంగా ప్రవేశించి గొడవకు దిగి దాడి చేసిన కేసులో పలువురిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ వినీత తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన తూటి శ్రీనివాస్‌కు డీమార్ట్ ఏరియాలో 301 సర్వే నంబర్‌లోని 10 గుంటల భూమి ఉన్నది. ఈ భూమి 2018లో గాండ్ల చంద్రమౌళి వద్ద కొన్నారు. కొద్ది రోజుల క్రితం బొంకూరి సరోజ అనే మహిళ, వారి కుటుంబ సభ్యులు కలిసి కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. దీంతో శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించగా తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. ఈ భూమికి కోర్టు ఆర్డర్ ఉండగా ఈ నెల 9న మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో శ్రీనివాస్ తన భూమిలోకి వెళ్లి జేసీబీతో భూమిని చదును చేస్తుండగా దేవిరెడ్డి మహేందర్ రెడ్డి, బొంకూరి శ్రీనివాస్ మరికొందరు అక్రమంగా భూమిలోకి ప్రవేశించి జేసీబీని రాళ్లతో కొట్టి అద్దాలు ధ్వంసం చేశారని సుమారు రూ.25వేల నష్టం జరిగినట్లు తూటి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## వృద్ధుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, ఏప్రిల్ 10 : అప్పులు తీర్చలేక మద్యానికి బానిసై మండంలోని పాతబెల్లంపల్లికి చెందిన నలిమెల రాజయ్య (57) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. రాజయ్య మంచిర్యాలలో వెల్డింగ్ షాప్ నిర్వహించాడు. గిరాకీలు రాకపోవడంతో కుంగిపోయాడు. కూతురు వివాహం కోసం కొంత అప్పు చేశాడు. ఈ క్రమంలో మానసికంగా కృంగిపోయి మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపానికి గురైన ఆయన ఇంటి ఆవరణలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కుందారంలో మహిళాభవన్ ప్రారంభం

జైపూర్, ఏప్రిల్ 10: మండలంలోని కుందారంలో బీఆర్ఎస్ హయాంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన మహిళాభవన్‌ను గురువారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.

## గీత కార్మికులకు కిట్ల పంపిణీ

చెన్నూర్, ఏప్రిల్ 10: చెన్నూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి గురువారం గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న గీత 70 మంది కార్మికులకు ఈ కిట్లను పంపిణీ చేశారు.

## గ్రూప్-1 ఉద్యోగం సాధించిన క్రాంతికి సన్మానం

మందమర్రి, ఏప్రిల్ 10: ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 552.5వ ర్యాంకు సాధించిన మందమర్రికి చెందిన సింగరేణి ఉద్యోగి దుర్గం క్రాంతిని ఫెండ్స్ సేవింగ్ సొసైటీ సభ్యులు, కాలనీ వాసులు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శనిగారపు కుమార్, దుర్గం స్వామి, కాదాసి రవీందర్ కోల రాజేశ్, దుర్గం రవి, గొర్ల శ్రీనివాస్, పూసాల సంపత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## రాంజీగోండు విద్యార్థులకు కూలర్ల వితరణ

బెల్లంపల్లి, ఏప్రిల్ 10 : పట్టణంలోని శ్రీ రాంజీగోండు విద్యార్థి నిలయానికి దాత కౌశిక్ మూడు కూలర్ ఫ్యాన్లు వితరణ చేశారు. గురువారం విద్యార్థి నిలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులకు అందజేశారు. తన తండ్రి సత్యనారాయణ స్మారకార్థం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నిలయం అధ్యక్షుడు కొడిప్యాక విద్యాసాగర్, కార్యదర్శి కాసర్ల తిరుపతి, రాచకొండ విజయలక్ష్మి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ రోడ్డు నిర్మించాలని వినతి

కన్నెపల్లి, ఏప్రిల్ 10 : భీమిని మండల కేంద్రంలో ప్రస్తుతం వేస్తున్న సింగిల్ రోడ్డు నిర్మాణం నిలిపివేసి డబుల్ రోడ్డు వేసి, ఇరువైపులా నాలాలు నిర్మించాలని కోరుతూ భీమిని గ్రామస్తులు గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సింగిల్ రోడ్డు వద్ద రెండు వాహనాలు పాస్ కావడం లేదని, నాలాలు కూడా సరిగ్గా లేక వర్షం నీరు చుట్టూ ఉన్న ఇండ్లలో చేరుతుందన్నారు. వెంటనే డబుల్ రోడ్డును నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీకాంత్, మహేందర్‌గౌడ్, ప్రశాంత్, శేఖర్, సాయి, నీలేశ్, రాజ్‌కుమార్, తిరుపతి, రాజు తదితరులున్నారు.

## వోల్వో డ్రైవర్ల సమ్మె విరమణ

జైపూర్, ఏప్రిల్ 10: ఇందారం ఓపెన్‌కాస్టు వరహ కంపెనీలో పనిచేస్తున్న వోల్వో డ్రైవర్లు గురువారం సమ్మె విరమించారు. హై పవర్ వేతనాలు చెల్లించాలని, రామగుండం ఓపెన్‌కాస్టులో ఉన్న విధంగా పెంచాలని డిమాండ్ చేస్తూ 12 రోజులుగా సమ్మె చేయగా డ్రైవర్లకు వివిధ సంఘాల వారు మద్దతు తెలిపారు. డ్రైవర్లతో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మాట్లాడారు. సమస్యపై జీఎం శ్రీనివాస్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. సవరించిన వేతనాలు మూడు నెలల్లో అందించేలా అన్ని చర్యలు తీసుకుంటామని జీఎం హామీ ఇచ్చారు. సమ్మె కాలానికి సంబంధించి 10 రోజుల వేతనాన్ని ఇవ్వాలని డ్రైవర్లు కోరగా 4 రోజుల వేతనం ఇస్తామని జీఎం అన్నారు. 6 రోజుల వేతనాన్ని అందించాలని ఎమ్మెల్యే వివేక్ సూచించడంతో వివాదం సద్దుమణగడంతో డ్రైవర్లు ఆందోళన విరమించారు.

## చదువుకు వయస్సు అడ్డుకాదు : డీఈవో

కాసిపేట, ఏప్రిల్ 11 : చదువుకు వయస్సు అడ్డురాదని, చదువు వస్తే ఎవరిపై ఆధార పడాల్సిన అవసరం ఉండదని డీఈవో ఎస్ యాదయ్య పేర్కొన్నారు. బుధవారం రాత్రి కాసిపేట మండలంలోని సోమగూడెం, లంబాడీతండా, కాసిపేట గ్రామాల్లోని అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాలను డీఈవో తో పాటు వయోజన విద్యాధికారి, కాసిపేట మండల స్పెషల్ ఆఫీసర్ ఏ.పురుషోత్తంతో కలిసి సందర్శించారు. వలంటీర్లు, అభ్యాసకులకు పలు సూచనలు చేశారు. చదువు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామాల్లోని సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ దరి, సత్యానారాయణ మూర్తి, డీఆర్పీలు బండ శాంకరి, కొండ జనార్దన్, సుమన్, ఇన్‌స్టెక్టర్లు రాజేశ్వరి, లావణ్య, విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలివ్వాలని వినతి

బెల్లంపల్లి, ఏప్రిల్ 10 : పట్టణంలోని సింగరేణి క్వార్టర్లకు చెందిన లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజం, రామ్‌చందర్, రాజేశ్, మాణిక్యం, రాజేశం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన ర్యాలీ

దండేపల్లి, ఏప్రిల్10. నకిలీ పత్తి విత్తనాలపై దండేపల్లిలో వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ తీశారు. అనంతరం రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. గ్లైసిల్ పత్తి విత్తనాలు, గ్లైఫొసెట్‌తో నష్టాలు, విత్తనాల కొనుగోలుకు సూచనలు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్ఐ తహసినొద్దీన్, ఏవో శ్రీకాంత్, రైతులు ఉన్నారు.

## అనుమతిలేని వెంచర్లను ఉపేక్షించవద్దు

దండేపల్లి, ఏప్రిల్ 10: అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా వ్యవసాయ భూములను ప్లాట్‌లుగా మార్చి చేపడుతున్న అక్రమ వెంచర్లను ఉపేక్షించవద్దని జిల్లా పట్టణ ప్రణాళిక అధికారి సంపత్‌కుమార్ ఆదేశించారు. దండేపల్లి మండలంలోని మేదరిపేట జీపీలో గురువారం పర్యటించారు. ఇలాంటి ప్లాట్లను ఎవరూ కొనవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, టీటీసీపీవో సిబ్బంది ఉన్నారు.

## నేడు నీటి సరఫరా బంద్

మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్10: నగరానికి మంచి నీరు అందించే జాలా గుట్ట పంప్ హౌస్ వద్ద పైప్ లైన్ పగిలి పోవడంతో, మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 11న నగరంలో మంచినీటి సరఫరాలకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ శివాజీ తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

## మంచిర్యాలలో కారు బీభత్సం!

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 10 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ క్వారీ రోడ్డులో ఓ గుర్తు తెలియని కారు బీభత్సం సృష్టించిన ఘటన గురువారం రాత్రి వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. హాజీపూర్ మండలం ర్యాలిగడ్‌పూర్ నుంచి మంచిర్యాలకు వస్తుండగా కారు నడుపుతున్న వ్యక్తి ర్యాష్ డ్రైవింగ్ చేసి ఓ బైక్‌ను ఢీకొనడంతో ఫార్చునర్ కారు పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు, ప్రమాద సమయంలో కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నట్లు బాధితులంతా బెంగళూర్, కడపకు చెందిన వారిగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. సమాచారం అందుకున్న మంచిర్యాల బ్లూకోల్ట్ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అక్కడ ఎవరూ కనిపించలేదని వారి కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

## తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

జైపూర్, ఏప్రిల్ 10: తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఐకేపీ, ఐసీడీఎస్, వ్యవసాయ, ఆరోగ్యశాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యానారాయణగౌడ్, ఏపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడాలి

• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్


నీటి ట్యాంకు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 10: మండుతున్న ఎండల దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్‌లో కొనసాగుతున్న అమృత్ 2.0 నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ శివాజీతో కలిసి పరిశీలించారు. శ్రీరాంపూర్, ఆర్‌కే-6, శ్రీరాంపూర్ బస్టాండ్, సీతారాంపల్లి ప్రాంతాల్లో పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అందుబాటులో లేని ప్రాంతాల్లో నీటి ట్యాంకర్లు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్లు, నీటి ట్యాంకుల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంజూరైనా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.

**వడ్ల కొనుగోలుకు ఏర్పాట్లు**

నస్పూర్,ఏప్రిల్ 10 : జిల్లాలో వరిధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 321 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి రూ. 2,320, సాధారణ రకానికి రూ. 2,300 ధర నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ సారి 3,41,795 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో 82,98,375 గోనె సంచులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తాలు, తప్ప, మట్టి పెల్లలు లేని ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్‌శ్రీకళ తదితరులున్నారు.

**అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు**

ఈ నెల 14న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిలోగా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో కొనసాగుతున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను మున్సిపల్ కార్పొరేషన్ డీఈ మధుకర్‌తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలన్నారు.

**గీత కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ**

కాటమయ్య రక్షణ కిట్లపై శిక్షణ పూర్తి చేసుకుని గీత కార్మికులకు నస్పూర్‌లో కలెక్టరేట్‌లో రక్షణ కిట్లను కలెక్టర్ కుమార్ దీపక్ పంపిణీ చేశారు. ఈ రక్షణ కిట్లతో 80 శాతం ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ పాల్గొన్నారు.

**పోషణ పక్షం పకడ్బందీగా నిర్వహించాలి**

జిల్లాలో ఈ నెల 22 వరకు జరగనున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం, పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పురుషోత్తం నాయక్, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సీడీపీవోలు విజయలక్ష్మీ, రేష్మ , మనోరమ ,జిల్లా సమన్వయకర్త రజిత తదితరులు పాల్గొన్నారు.

# కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

• కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే


కూలీలతో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కాగజ్‌నగర్, ఏప్రిల్ 10: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పని కల్పించాలని సంబంధిత అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన డీఆర్డీవో దత్తారావుతో కలిసి పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పని కల్పించాలని, పని ప్రదేశాలలో కూలీలకు మంచి నీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్ల సౌకర్యం కల్పించాలన్నారు. ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కూలీలకు వేతనాలను సకాలంలో చెల్లించాలన్నారు. జిల్లాలోని అర్హులు ఈ నెల 14 వ తేదీలోగా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం చింతగూడలోని నర్సరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పోషణ పక్షాన్ని విజయవంతం చేయాలి**

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 10 : జిల్లాలో ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమంపై జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి హాజరై ఐసీడీఎస్ సీడీపీవో లు, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, మెప్మా అధికారులు, యునిసెఫ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగనున్న పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా పిల్లలలో మానసిక, శారీరక ఎదుగుదల, తల్లి ప్రాముఖ్యత, పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో ఉమర్ హుస్సేన్, మెప్మా పీడీ మోతీరామ్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మెరుగైన వైద్య సేవలందించాలి**

ప్రభుత్వ దవాఖానలు ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధులపై నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో డీఎంహెచ్‌వో సీతారాంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆయుష్ వైద్యులు, పీఎం జన్ మన్ వైద్య సిబ్బంది, సూపర్ వైజర్లతో వైద్య ఆరోగ్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రాంతాలు, పీవీటీజీ ప్రాంతాల్లో పీహెచ్‌సీలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు.

# మహాత్మా జ్యోతిబాపూలేకు భారత రత్న ప్రకటించాలి

• బీసీ హక్కుల సమితి నేతల వినతి

మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్ 10: మహాత్మా జ్యోతిబాపూలేకు భారత రత్న ప్రకటించాలని జాతీయ బీసీ హక్కుల సమితి నేతలు గురువారం అడిషనల్ కలెక్టర్ మోతీలాల్‌కు వినతి పత్రం అందించారు. స్వాతంత్ర్యానికి ముందే కుల వివక్షపై పోరాటం, అంటరానితనం, దురాచారాలు, మూఢనమ్మకాల నివారణపై, సమసమాజా స్థాపన కోసం మహాత్మా జ్యోతిబాపూలే శక్తి వంచన లేకుండా కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గుమ్ముల శ్రీనివాస్, చెలిమెల అంజన్న, బండా సతీశ్, బొడంకి కుమార్, గోలివాండ వంశీ, అంకం సతీశ్ తదితరులు పాల్గొన్నారు. పూలే 198వ జయంతి వేడుకలను ఈ నెల 11న బీసీ భవన్‌లో జరుపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బీసీ నాయకులు, బీసీ ప్రజలు రావాలని బీసీ ఐక్య వేదిక నాయకులు కోరారు.

**నేడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి**

నస్పూర్, ఏప్రిల్ 10 : నస్పూర్‌లో కలెక్టరేట్‌లో ఈ నెల 11న మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించనున్నట్లు జిల్లా వెనకబడిన తరతగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ తెలిపారు. నాయకులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 10: జగిత్యాల పట్టణంలో ఇటీవల వరుసగా దొంగతనాలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగను జగిత్యాల టౌన్ పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాలలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. చొప్పదండి మండలం రాగంపేటకు చెందిన బక్కశెట్టి కొమురయ్య అలియాస్ రేగుల అజయ్‌కుమార్‌ను చిన్నతనంలో తండ్రి వదిలివెళ్లిపోయాడు. ఆ తర్వాత కొమురయ్య హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనికి కుదిరాడు. కంపెనీ యజమాని వేతనం ఇవ్వకపోవడంతో లారీలోంచి డెక్కు(మ్యూజిక్ సిస్టం)ను దొంగిలించి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడు. ఆ తర్వాత పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడి పలు మార్లు జైలు జీవితం గడిపాడు. వివాహం చేసుకున్న అనంతరం మకాంను మంచిర్యాల జిల్లా కేంద్రానికి మార్చాడు. 2018 నుంచి 21 వరకు వరంగల్‌లోని సెంట్రల్ జైల్లో ఉండి విడుదలయ్యాడు. గత జనవరి నుంచి మార్చి 28 వరకు జగిత్యాల పట్టణంలో ఏడు ఇండ్లల్లో, కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 9న పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కొమురయ్యను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, అతడి వద్ద బంగారు ఆభరణాలు దొరికాయి. ఇటీవల జగిత్యాల పట్టణంతో పాటు కొడిమ్యాల మండలంలో ఎనిమిది చోరీలు చేసినట్లు అంగీకరించాడని, అతడి వద్ద నుంచి 26 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## ధాన్యం కొనుగోలుపై అవగాహన

బెల్లంపల్లి, ఏప్రిల్ 10 : మండలంలోని కన్నాల రైతువేదికలో వరి కొనుగోలుపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ, డీఆర్డీఏ సభ్యులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ మోతీలాల్ హాజరై అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోలు, కొనుగోలు కేంద్రాల్లో వసతులపై సూచనలు చేశారు.

## నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

వేమనపల్లి, ఏప్రిల్ 10 : అగ్రవర్ణ పెత్తందార్ల వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న పేర్కొన్నారు. గురువారం వేమనపల్లి మండల కేంద్రంలో సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మంగెనపల్లికి చెందిన నాయిని కన్నయ్యను అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణం పెత్తందారి అయిన ఎనగంటి చిన్నన్న, అతని భార్య లక్ష్మి వేధించడంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. ఆరు రోజులైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు కుటుంబాన్ని పరామర్శించకపోవడం సిగ్గు చేటన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం, కన్నయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పైళ్ల ఆశయ్య, ఎర్మ పున్నం, సంకె రవి, వలీ హైదర్, రాజాబాబు, మల్లేశ్, రవి, ఎల్లయ్య, రవి, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన నాయకుల ముందస్తు అరెస్ట్

కాసిపేట, ఏప్రిల్ 10 : పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల గిరిజన ట్రైకర్ బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని నిలదీయడానికి హైదరాబాద్‌కు బయలుదేరుతున్న సేవాలాల్ సేన నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తాజా మాజీ సర్పంచ్ అజ్మీర తిరుపతి నాయక్ పేర్కొన్నారు. గురువారం కాసిపేట మండలంలోని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీరా తిరుపతి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాదవ్ గజానంద్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మీరా రాజేశ్ నాయక్‌ను ముందస్తు అరెస్ట్ చేశారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు : డీఎంహెచ్‌వో

దండేపల్లి, ఏప్రిల్ 10: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ హెచ్చరించారు. మండలంలోని తాళ్లపేట పీహెచ్‌సీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు, వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవల గురించి వైద్యుడిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వైద్యసేవలు, సాధారణ ప్రసవాలు, వడదెబ్బపై అవగాహన, 108, 102 సర్వీస్ సేవలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యులు, అధికారులున్నారు.

## నీటి కుంటల కోసం స్థలాల పరిశీలన

శ్రీరాంపూర్, ఏప్రిల్ 10: సింగరేణి సీఎండీ బలరాం చేపట్టిన 'నీటి బిందువు-జల సింధువు'కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియాలో 5 నీటి కుంటలకు స్థలాలను పరిశీలించినట్లు జీఎం శ్రీనివాస్ తెలిపారు.

## పాలిసెట్ పై ఉచిత శిక్షణ ప్రారంభం

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 10: సీసీసీ సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను గురువారం శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణంపై అవగాహన

మందమర్రి, ఏప్రిల్ 10: పర్యావరణ పరిరక్షణపై జీఎం కార్యాలయ హెచ్‌వోడీలకు జీఎంవోఈఎఫ్ అండ్ సీసీ అడ్వైజర్, సైంటిస్ట్ పీ శరత్ కుమార్ అవగాహన కల్పించారు. మందమర్రి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రజతోత్సవ వేడుకల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను పంపిణీ చేస్తున్న మండల అధ్యక్షుడు బండు

కౌటాల, ఏప్రిల్ 10: బీఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవ వేడుకల పోస్టర్లను గురువారం కౌటాలలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగపురే బండు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ వేడుకలకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని విర్దండి, ఇతర గ్రామాలకు బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల పోస్టర్లను పంపిణీ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాంటెంకి నవీన్, సందీప్, తదితరులున్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఏఎస్పీ


రెబ్బెనలో చలివేంద్రం ప్రారంభోత్సవంలో ఏఎస్పీ చిత్తరంజన్

రెబ్బెన, ఏప్రిల్ 10: రెబ్బెన మండల కేంద్రంలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏఎస్పీ చిత్తరంజన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ బుద్ధేస్వామి, ఎస్ఐ చంద్రశేఖర్, ఆర్టీఏ మెంబర్ లావుడ్య రమేశ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వేముర్ల సంతోశ్, మాజీ ఎంపీటీసీ పెసరి మధునయ్య, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ కుందారపు శంకరమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, బీఆర్ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, నాయకులు చిరంజీవిగౌడ్, నవీన్‌గౌడ్, అన్నపూర్ణ మురళీగౌడ్, గొడిసెల వెంకటేశ్వర్‌గౌడ్, సంజుజైస్వాల్, నర్సింహులుతో పాటు పలువురు ఉన్నారు.

## నకిలీ విత్తనాలు ట్రాన్స్‌పోర్ట్ చేస్తే చర్యలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 10: ట్రాన్స్‌పోర్ట్‌ల ద్వారా నకిలీ విత్తనాలు రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఏడీఏ మనోహన్, పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. గురువారం కాగజ్‌నగర్‌లోని పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, గోదాములను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏదైనా అనుమానాస్పదంగా సరుకు ట్రాన్స్‌పోర్ట్‌లో వస్తే వెంటనే పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, అనుమతులు లేని విత్తనాలు ఎగుమతి, దిగుమతి చేయవద్దని సూచించారు. అనంతరం విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. అనుమతి లేని, నాసిరకం, నకిలీ విత్తనాలు విక్రయించవద్దని, రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, వ్యవసాయ శాఖ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 10 : జిల్లా కేంద్రంలోని పీవీటీజీ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరంలో 3 వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని పీవీటీజీ గిరిజన గురుకులం ప్రిన్సిపాల్ కారం భద్రయ్య తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురుకులంలో ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మొత్తం 218 సీట్లు ఖాళీలు ఉండగా అందులో 3వ తరగతిలో 80, 4వ తరగతిలో 62, 5వ తరగతిలో 38, 6వ తరగతిలో 21, 8వతరగతిలో 17 ఖాళీలున్నట్లు తెలిపారు. అర్హులైన పీవీటీజీ తెగలకు చెందిన కొలాం, తోటి, మన్నె విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## నర్సరీని సందర్శించిన డీఎఫ్‌వో

రెబ్బెన, ఏప్రిల్ 10: రెబ్బెనలోని సెంట్రల్ నర్సరీని గురువారం ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ సందర్శించి నట్లు రెబ్బెన డిప్యూటీ రేంజ్ అధికారి భానేశ్ తెలిపారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కల వివరాలు తెలుసుకోవడంతో పాటు నర్సరీ పూర్తిగా తిరిగి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

జైనూర్, ఏప్రిల్ 10: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డెన్ సెర్చ్ నిర్వహించనున్నట్లు సీఐ ఈ రమేశ్ అన్నారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఏఎస్పీ చిత్త రంజాన్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని గౌరీ గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గౌరీ గ్రామంలో తనిఖీలు చేసి, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనుమానాస్పదంగా ఎవరైనా గ్రామంలో కనబడితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రవి కుమార్, రామకృష్ణ, ఉల్లాస్, బొజ్జిరావు, ఆర్ఎస్ఐ మల్లేశ్, 30 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది, 21 సివిల్, 8 మహిళ సిబ్బంది ఉన్నారు.

## పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

పెంచికల్ పేట్/కౌటాల,ఏప్రిల్ 10 : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో జిల్లాలో యువ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ తెలిపారు. గురువారం మండలంలోని బొంబాయిగూడ గ్రామ శివారులో సర్వేనంబర్ 177 భూమిని యువ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు కోసం పరిశీలించారు. అలాగే కౌటాల మండలంలోని కనికి ప్రాంతాల్లో అనువైన స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట పెంచికల్ పేట్ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఆల్బర్ట్, సర్వేయర్ శ్రీకాంత్, కౌటాల తహసీల్దార్, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ తదితరులున్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్10: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని బీసీ వెల్ఫేర్ జాయింట్ సెక్రెటరీ తిరుపతి అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. డార్మెంటరీ, వంటశాల, నిత్యావసర సరుకులను పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించిచారు. అనంతరం ప్రిన్సిపాల్ రత్నాబాయి, ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశం నిర్వహించిన పలు సూచనలు చేశారు.

## గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 10: గంజాయి అమ్ముతూ పట్టుబడిన కేసులో పట్టణంలోని చున్నంబట్టివాడ శ్రీశ్రీనగర్‌కు చెందిన కామెర అమిన్‌ను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ముత్తె ప్రవీణ్ కుమార్ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, మంచిర్యాల వంద ఫీట్ల రోడ్డు వద్ద ఓ వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి నిందితుడిని పట్టుకొని విచారించామన్నారు. నిందితుడి వద్ద ఉన్న 178గ్రాముల ఎండు గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.